# ఎక్కడైనా ఒకటే

**వా**ళ్ళిద్దరూ ఆఖరుసారి సూరయ్యగారి గొడ్లసావిడి వెనక చింతచెట్లమధ్య కలుసుకున్నారు. అప్పటికి పొద్దూకి గంట అయింది. కను చీకటి పడే సమయంలో శేషు అక్కడికి చేరి, పెద్ద చెట్టెక్కి కొమ్మల్లో కూచుని, రత్తమ్మకోసం ఎదురు చూడసాగాడు. ఎంతోసేపటికిగాని రత్తమ్మ రాలేదు. నడ్డి ఆడించటాన్ని బట్టి చీకట్లో కూడ శేషు రత్తమ్మను పోల్చుకోగలిగాడు. తాను చెట్టుమీద ఉన్నట్టు గుర్తుగా సన్నగా ఈలపాట పాడాడు.

రత్తమ్మ చెట్టుచాటుకువచ్చి పైకిచూసి "నువ్వొచ్చి శానాసేపయిందా?" అన్నది.

"కాలా మరీ?" అన్నాడు శేషు చెట్టుకొమ్మనుంచి వేళ్ళాడి, చేతులు వొదిలేస్తూ.

"ఏంటి మరిప్పుడూ?" అన్నది రత్తమ్మ.

"నువే చెప్పు. ఇంతకీ ఏం జేయదలిచా?"

"నేనేం జేసేదీ, నా బూడిదా? మా అయ్య సచ్చినా ఒప్పుకోడు."

"అయితే నేను రైలుకింద పడాల్సిందే?"

"ఛా! ఊరుకో!" రత్తమ్మ తన మునివేళ్ళతో శేషు గుండెలమీద అపేక్షగా తడివింది. తరవాత శేషుకు దగ్గిరగా జరిగి నిలబడింది.

వాళ్ళిద్దరికీ జీవితంలో ఒకటే కోరిక – పెళ్ళాడాలని. కాని అది జరిగేది కాదు. ఆ అల్పప్రాణుల సుఖానికి అవాంతరంగా వాళ్ళకు మించిన శక్తులే ఉన్నాయి. రత్తి తండ్రిని ధిక్కరించలేదు. రత్తి తండ్రికి ఎదురు తిరిగి శేషు ఆ ఊళ్ళో బతకనూలేడు.

ఈ అల్పప్రాణులు ఎంతసేపు మాట్లాడుకున్నా ఒకరిమీద ఒకరు ప్రమాణాలు చేసుకోగలరు; అమాయకమైన తమ ప్రేమను వాళ్ళకు అర్థమయ్యే భాషలో వ్యక్తం చేసుకోగలరు: ఒకరికోసం ఒకరు కొట్టుకుపోగలరు. అంతే తప్ప తమ మధ్య ఉండే అగాథం మీదుగా దూకలేరు.

"మనం ఒక్కసారన్నా నిజంగా సుకపడలేదు రత్తీ... ఎవరూ లేరు. ఏమంటావ్?" అన్నాడు శేషు రహస్యంగా.

"ఓలమ్మో, ఇంకేమైనా ఉందా?" అన్నది రత్తి అతని పట్టులో పెనుగులాడుతూ.

"ఒక్కసారి, రత్తీ!... ఆతరవాత రైలుకింద పడిపోతా!" అన్నాడు శేషు.

రత్తి ఏడిచింది. ఎట్లా ఓదార్చాలో శేషుకు చాతకాలేదు.

"ఊరుకో! ఇంతమాత్రానికే చస్తారా ఏం? అట్టా అనిపిస్తదిగాని?" అన్నాడు శేషు.

"నా పెళ్ళయినాక నువేం జేస్తావో చెప్పు. చెప్పకపోతే నన్ను చంపుకు తిన్నట్టే!" అన్నది రత్తి.

"ఏదో నా యేడుపు నేనేడుస్తా!"

"అంత వొట్టేసినా చెప్పవా?"

శేషు ఆరాటపడ్డాడు. వాడికి మాట్లాడాలని లేదు.

"పట్నం వెళ్ళిపోతారత్తీ, సినిమాల్లో జేరతా!" అన్నాడు బలవంతాన.

"అక్కడ మంచి మంచి ఆడోళ్ళంతా ఉంటారుగావాలి!" అన్నది రత్తమ్మ అసూయతో.

"ఆళ్ళందర్నీ గంగలో పడనీ!"

"వొళ్ళు మాత్రం జాగర్త గుంచుకో."

"నే నుంచుకోను" అన్నాడు శేషు మంకుతనంగా.

కాస్సేపు ఇద్దరికీ ఏం మాట్లాడాలో తెలీలేదు.

"అయితే, వద్దంటావా?" అన్నాడు శేషు.

"అమ్మో!.... ఇక నే నెల్లాలమ్మా! శానాసేపయింది ఇల్లొదిలి!"

ముందు రత్తమ్మే వెళ్లిపోయింది. శేషు మనస్సంతా అంధకారంలో మునిగిపోయింది.

ఒక్కసారి - ఒక్కసారన్నా రత్తి తనని సుఖపెట్టలేదన్న బాధే వాడికి మిగిలింది.

❀ ❀ ❀ ❀ ❀

ఏడాది జరిగింది.

శేషు పట్నంలో చేరి, తిండికి మాడి, సినిమా కంపెనీల చుట్టూ తిరిగి ఎంతో కష్టపడ్డ మీదట నౌకరుపని సంపాదించి చివరకు ఎక్స్‌ట్రా వేషాలు వేసే మూకలో చేరాడు. ఇది కొత్త జీవితం. కొత్త జన్మ.

అకస్మాత్తుగా ఒకరోజు బస్సులో వాడికి రత్తి కనిపించింది. వాడు మొదట గుర్తుపట్టలేదు. తరవాత గుర్తుపట్టాడుగాని తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. రత్తి ముందే వాణ్ణి చూసి ఉండాలి. ఎంతసేపు చూసినా తనకేసి చూడనేలేదు.

శేషు దిగాలిసిన చోటు వచ్చింది. కాని వాడు దిగలేదు. కండక్టరును పిలిచి, "చివరిదాకా టిక్కట్టియ్యి" అని పావలా బిళ్ళ చేతిలో పెట్టాడు. మరి రెండు స్టాపుల అవతల రత్తి దిగింది. ముందు సీటులోనుంచి ఎవడో కోరమీసాలవాడు లేచి నిలబడి రత్తికి దిగమని సంజ్ఞ చెయ్యటం శేషు చూశాడు.

బస్సు మళ్ళీ కదలబోతుండగా శేషు కూడా దిగాడు. రోడ్డు ప్రక్కగా ఇద్దరూ నడిచిపోతున్నారు. రత్తి నడ్డితిప్పు కొంచెం కూడా మారలేదు. యాభై గజాలు వెనకగా శేషు వాళ్ళను అనుసరించి నడిచాడు.

మధ్యలో ఒకే ఒక్కసారి రత్తి వెనక్కు తిరిగి శేషు తనవెంట వస్తూండటం గమనించింది. రత్తి మొహంలో శేషుకు భయం కనిపించింది.

వాళ్ళు ఒక సందులోకి తిరిగి ఒక పాతకాలపు పెంకుటింట్లోకి దూరారు. వాళ్లింటి ముందుగా నడచి అంత దూరాన ఉన్న సిగరెట్టు బంకు దగ్గరికి వెళ్ళి కానీ బీడీలుకొని, ఒకటి కొబ్బరితాటికి అంటించి ఆ ఇంటి వాకిలికేసే చూస్తూ నిలబడ్డాడు.

శేషు మూడో బీడీ కాలుస్తుండగా మీసాలవాడు బయటికి వచ్చి మళ్ళీ బస్ స్టాప్ కేసి వెళ్ళాడు. శేషు వీథి మలుపుదాకా వెళ్లి, వాడు బస్సెక్కినదాకా నిలబడి పెంకుటింటికి తిరిగివచ్చి "ఎవరండి లోపలా?" అని అరిచాడు.

రత్తి లోపలినుంచి తొంగిచూసి, "శేషూ! రా లోపలికి?" అన్నది.

"ఏంటిది రత్తి? ఇక్కడెట్లా వచ్చిపడ్డావు? నీ పెళ్లి అయిందా?"

"లేదు, పెళ్లి రేపనగా డబ్బు తీసుకొని పారిపోయి రైలెకా!?"

"ఎన్నాళ్లయింది నువ్వొచ్చి?"

"కాలా ఆరేడు నెల్లు."

"ఏం జేస్తున్నావు?"

"సినిమాల్లో యేసాలేస్తున్నా, చిన్నవేలే, ఈసారి మంచి యేసం ఇస్తారంట!" ఎక్స్ట్రా వేషాలు వేస్తున్నానని శేషు కెందుకు చెప్పటం?

"ఎందులో?" అన్నాడు శేషు ఇంకో బీడీ ముట్టిస్తూ.

"అదేందో పేరబ్బా! నువ్వు?"

"నేను కూడా పిల్లయిారో వేసాలేస్తున్నా. ఎప్పుడో పెద్ద యిారో జేస్తారంట!"

"పోనీలే పాపం! బాగున్నావుగద?"

"నువ్వు?"

"బాగనే ఉన్నా, శేషూ!"

"ఒక్కసారైనా మనం సుఖపళ్లేదు. రత్తీ! ఏఁవంటావ్?" శేషు గొంతులో వెనకటి దైన్యంలో కొంతైనా రత్తికి వినిపించింది.

"అమ్మో! సంపెయ్యడూ?"

"ఇప్పుడ్రాడూ?"

"అయితే నేనెల్లి రానా?"

"మళ్లీ అవుపిస్తాలే శేషూ!"

"అట్టానేలే, రత్తీ!"

శేషు బయటికొచ్చి బీడీ నేలకేసి విసిరికొట్టి తలపైకెత్తి దర్పంగా బస్‌స్టాప్ కేసి వెళ్ళాడు.

రత్తి కుళ్ళి కుళ్ళి ఏడవసాగింది. ఈ మీసాలవాడి పాలపడకముందు నాలుగు నెల్లు నానా అగచాట్లు పడి శేషు కోసం ఎందరినడిగిందో, ఎన్నిచోట్ల వెతికిందో రత్తమ్మ శేషుతో చెప్పనేలేదు.

ఎందుకు చెప్పటం? చెప్పుకుని చేసేదేముందీ?

*ముద్రణ : కొడవటిగంటి కుటుంబరావు కథలు, 1960-63 మధ్య?*

*జయా పబ్లికేషన్స్, విజయవాడ*